## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

కర్నూలు క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి) : సోమవారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం తెలిపారు. పోలీసు అధికారులు బందోబస్తు విధుల్లో ఉన్న కారణంగా సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

# ధాన్యం దళారులపాలు..!



కర్నూలు మార్కెట్ యార్డులో నామమాత్రంగా ధాన్యం కొనుగోలు

- కర్నూలు మార్కెట్ యార్డులో వారిదే హవా
- అవగాహన లేక నష్టపోతున్న రైతులు
- మార్కెట్ సెస్సుకూ నష్టమే

కర్నూలు అగ్రికల్చర్, మే 11 (ఆంధ్రజ్యోతి): దశాబ్దం కాలంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ధాన్యం పండిస్తున్న రైతులు నిలువుదోపిడీకి గురవుతున్నారు. ఓ వైపు వ్యాపారులు, మరో వైపు దళారులు సిండికేట్‌గా మారి రైతులు పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అంతటితో ఆగక రైతులకు డబ్బులు కూడా ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. కొంత మంది వ్యాపారులు రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు రాత్రిపూట ఎగుమతి చేస్తూ మార్కెటింగ్ శాఖకు చెల్లించాల్సిన సెస్సును కూడా ఎగ్గొడుతున్నారు. వీటన్నింటికీ చెక్ పెట్టే దిశగా కర్నూలు మార్కెట్ యార్డులో మార్చి నెలలో కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ తదితర ఉద్యోగులు ప్రజాప్రతినిధులను మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు నచ్చజెప్పి యార్డులో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే కర్నూలు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినా రైతులు ఇక్కడికి రాకుండా తమ మిల్లులకే వచ్చేలా రైతులను కట్టడి చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వ్యాపారులను దళారులను కట్టడి చేసి రైతులు ధాన్యాన్ని కర్నూలు యార్డుకు తీసుకువచ్చేందుకు అధికారులు చిత్తశుద్ధితో కర్నూలు మార్కెట్ కమిటీ యంత్రాంగానికి సహకరించడం లేదనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.



### ఏటా 2 లక్షల ఎకరాల్లో వరి సాగు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కృష్ణ, తుంగభద్ర నదుల ఆధారంగా సుంకేసుల రిజర్వాయరుతో పాటు కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, తెలుగుగంగ, సిద్దాపురం ఎత్తిపోతల పథకాలతో పాటు చెరువుల ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 2లక్షల ఎకరాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. ఇప్పటిదాకా ఈ పంటనంతా రైతులు, వ్యాపారులు దళారుల చేతుల్లో పోసి వారు అందించే నామమాత్రపు ధరను మాత్రమే పొందుతూ నష్టపోతున్నారు. ఈ క్రమంలో అక్రమార్కులు ఇచ్చే మామూళ్లకు కొందరు అధికారులు తలొగ్గి రైతులకు నష్టాలను కలిగిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోళ్లను పెంచేందుకు చర్యలు తీసుకోవాలంటూ సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ ఈవిషయంలో జోక్యం చేసుకుని రెవెన్యూ, పోలీసు, సివిల్ సప్లయ్, మార్కెటింగ్ శాఖ యంత్రాంగాలను సమన్వయం చేసి వ్యాపారులు తప్పనిసరిగా కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేపట్టేలా చేయాల్సిన అవసరం నెలకొంది. కర్నూలు యార్డులో ధాన్యం కొనుగోళ్లు పూర్తి స్థాయిలో చేపడితే.. రైతులకు గిట్టుబాటు ధర అందడమే కాకుండా మార్కెటింగ్ శాఖకు పెద్దఎత్తున సెస్సు రూపంలో ఆదాయం అందే అవకాశం ఉంది.

### రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్షల ఎకరాల్లో వరి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. రైతులు ఇప్పటి దాకా ధాన్యాన్ని మిల్లుల్లో వ్యయ ప్రయాసల కోర్చి వ్యాపారులకు అమ్ముకోవడం జరుగుతుంది. దీని వల్ల రైతులు నష్టపోవడమే కాకుండా మార్కెటింగ్ శాఖ ఆదాయానికి కూడా పెద్దఎత్తున గండి పడుతుంది. ఈ పరిస్థితిని నివారించేందు కోసం మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, అదే విదంగా మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డితో పాటు ఎమ్మెల్యేలతో మాట్లాడి కర్నూలు మార్కెట్ యార్డులో రెండు నెలల క్రితం ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాం. గ్రామాల్లో ఈ సమాచారాన్ని రైతులందరికీ తెలియజెప్పేందుకు ప్రచారాన్ని కూడా చేస్తున్నాం. త్వరలోనే కర్నూలు మార్కెట్ యార్డులో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్ల ప్రారభించడం జరుగుతుంది. వ్యాపారులు కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ మిల్లుల్లో కాకుండా కర్నూలు మార్కెట్ యార్డులోనే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించాం.

-జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, కర్నూలు

## జిల్లాలో ఆకస్మిక తనిఖీలు

**బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో చెకింగ్**


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దేశ సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, పలు కూడళ్ల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిల్లో సరిహద్దులు, చెక్‌పోస్టుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసు బృందాలు డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండులో తనిఖీలు చేపట్టాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరుదేశాల ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజల భద్రతే లక్ష్యంగా ముందస్తు తనిఖీలు చేపట్టామన్నారు. అనుమా నాస్పద వ్యక్తులు, వస్తువులు గానీ, కొత్తగా ఎవరైనా వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. తనిఖీల్లో డీఎస్పీతో పాటు టూటౌన్ సీఐ నాగరాజరావు, ఏఆర్ఎస్ఐ నబీరసూల్, హెడ్‌కానిస్టేబుల్ ఆచారి, డాగ్ హ్యాండ్లర్ ప్రసాద్ ఉన్నారు.

## భానుడి భగభగలు

**అత్యధికంగా పాణ్యంలో 41.92 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**


నిర్మానుష్యంగా నంద్యాల టీటీడీ రోడ్డు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పాణ్యంలో ఆదివారం 41.92 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం చల్లగాలులు వీచినప్పటికీ 11గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చాడు. ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు అధిక ఉష్ణోగ్రతతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే హడలిపోయారు. పాణ్యం తర్వాత పాములపాడు 41.2, దొర్నిపాడు 41.89, బండిఆత్మకూరు 41.71, అవుకు 41.38, మహానంది 41.24, ఆళ్లగడ్డ 40.95, రుద్రవరం 40.59, నంద్యాల 40.52, సంజామల 40.47, నందికొట్కూరు 40.22 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే కోవెలకుంట్ల 40.22, బనగానపల్లె 40.03, చాగలమర్రి 39.76, కొత్తపల్లె 39.68, జూపాడుబంగ్లా 39.64, బేతంచర్ల 39.39, గోస్పాడు 39.11, గడివేముల 39.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

### కర్నూలు జిల్లాలో..

కర్నూలు జిల్లాలో కర్నూలు నగరం 40.78, కల్లూరు 39.38, వెల్దుర్తి 39.1, మంత్రాలయం 39.09, కోడుమూరు 38.79, కౌతాళం 38.59, ఓర్వకల్లు 38.59, హొళగుంద 38.59, దేవనకొండ 38.56, నందవరం 38.4, తుగ్గలి 38.3, సి.బెళగల్ 38.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోసిగి 38.2, మద్దికెర 38.2, ఎమ్మిగనూరు 38.16, గోనెగండ్ల 38.0, కృష్ణగిరి 38.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి. కర్నూలు జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 21,324 మంది హాజరవుతున్నారు. ఇందులో ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సు విద్యార్థులు 15,501 మంది కాగా, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 791 మంది మొత్తం 16,292 మంది ఉన్నారు. అలాగే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 5,032 మంది ఉన్నారు. ఇందులో జనరల్ కోర్సు విద్యార్థులు 4,437 మంది కాగా, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 595 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 52 పరీక్ష కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాలను ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అధికారులు మాల్ ప్రాక్టీసు జరగకుండా పర్యవేక్షిస్తారు.



# కార్యదర్శుల జీవితాల్లో వెలుగులు

- పంచాయతీరాజ్‌లో ప్రక్షాళన
- సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం
- గ్రేడ్లను బట్టి హోదాలు
- గాడి తప్పిన పాలన పట్టాలెక్కేనా?
- మొండిచేయి చూపిన గత ప్రభుత్వం



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం

కర్నూలు కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అస్తవ్యస్తంగా ఉన్న పంచాయతీ రాజ్ శాఖను ప్రక్షాళన చేయనుంది. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శుల్లో ఆరు గ్రేడ్ల వ్యవస్థ ఉండటంతో అటు పదోన్నతులు లభించక.. ఇటు తక్కువ స్కేల్ జీతంతో కాలం వెళ్లదీస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-4 జీతభత్యాలు, జూనియర్ అసిస్టెంట్ హోదాకు సమానం. కానీ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-3 జీతభత్యాలు సీనియర్ అసిస్టెంట్‌కు సమానం కాదు. సాధారణంగా గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి జీతభత్యాలు పరిపాలన అధికారి కొలువుతో సమానంగా ఉండాలి. గెజిటెడ్ హోదా కూడా ఉండాలి. ఇక గ్రేడ్- 5, 6 పంచాయతీ కార్యదర్శి జీతభత్యాలు రికార్డు అసిస్టెంట్‌స్థాయిలో ఉండటం మరీ దారుణం. గత ప్రభుత్వం వీరిని దాదాపు మూడేళ్ల పాటు ప్రొబేషన్‌లో ఉంచి కేవలం రూ.15వేలు జీతమిచ్చి వారి జీవితాలతో ఆటాడుకుంది. వీరికి మూడు నోషనల్ ఇంక్రిమెంట్లు చెల్లించకుండా మొండిచేయి చూపింది. దీంతో అనేక సంవత్సరాలుగా చాలీచాలని జీతభత్యాలతో వారు సతమతమవుతున్నారు.

### నాలుగు గ్రేడ్లుగా కుదింపు

ప్రస్తుతం ఉన్న ఆరు గ్రేడ్ల వ్యవస్థను నాలుగు గ్రేడ్లుగా కుదించాలని ప్రభు త్వం సంకల్పించింది. పదివేల జనాభా పైబడి కోటి రూపాయల సంవత్సర ఆదాయం కలిగిన పంచాయతీలలో ఇకమీదట స్పెషల్ గ్రేడ్ పంచాయతీ కార్యదర్శి ఉంటారు. వీరు డిప్యూటీ ఎంపీడీవో హోదాకు సమాన స్థాయిని కలిగి ఉంటారు. 4000 నుంచి 10వేల జనాభా కలిగి రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు ఆదాయం ఉన్న మండల కేంద్ర గ్రామ పంచాయతీలకు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి నాయకత్వం వహిస్తారు. ఇక 2వేల నుంచి 4వేల జనాభా కలిగిన గ్రామ పంచాయతీలకు గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిని నియమిస్తారు. 2000లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలను గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు అప్పగిస్తారు.

### 16వ తేదీలోపు నివేదిక

ఈ ప్రతిపాదనలపై ఈ నెల 13న డిప్యూటీ ఎంపీడీవోలతో, డివిజినల్ పంచాయతీ అధికారులతో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 16వ తేదీలోగా కలెక్టర్లు తమ పరిశీలనకు వచ్చిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ జీతభత్యాలను సెకండరీ గ్రేడ్ టీచర్ స్థాయికి తక్కువ కాకుండా నిర్ణయించాలని అభ్యర్థిస్తున్నారు. సాధారణంగా ప్రతి కార్యాలయంలో జూనియర్, సీనియర్ గుమస్తాలు, పరిపాలన అధికారులు ఉంటారు. వారి వేతన స్కేళ్లకు అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులకు మూడు గ్రేడ్లు ఏర్పరిచి జీతభత్యాలు నిర్దేశించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వం కూడా వారి వేతన స్కేళ్లను సవరించేందుకు కసరత్తు చేస్తోంది. గాడి తప్పిన గ్రామ పంచాయతీ పరిపాలన ఈ నిర్ణయాలతో తిరిగి పట్టాలెక్కుతుందని భావిస్తున్నారు.

# మీనాక్షినాయుడుతో అధినాయకుల భేటీ

- చర్చలు జరిపిన ఆదోని అబ్జర్వర్, జిల్లా అధ్యక్షుడు
- కార్యాలయాల్లో పనులు కావడం లేదని ఆవేదన
- టీడీపీ క్యాడర్‌లో నెలకొన్న నిరాశ, నిస్పృహలు
- అందరికీ న్యాయం చేస్తామని హామీ

ఆదోని, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుతో టీడీపీ అధినాయకులు భేటీ అయ్యారు. ఈ భేటీ సర్వత్రా చర్చనీయాంశమైంది. నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై చర్చలు జరిపేందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆదోనికి నూతనంగా ఎంపికైన అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆదివారం ఉదయం ఎనిమిదన్నర గంటలకు మీనాక్షినాయుడు ఇంటికి చేరుకున్నారు. అరగంట పాటు ప్రత్యేకగదిలో చర్చలు జరిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి వాహ నంలోని మీనాక్షినాయుడు ఎమ్మిగనూరు వరకు వెళ్లినట్లు సమాచారం. ఇదిలా ఉండగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఇటీవల కలెక్టర్, ఎస్పీతో పాటు ఉన్నత అధికారులు నియోజకవర్గంలో ఏర్పడిన స్తబ్దత గురించి వివరించినా ఇప్పటివరకు ఎలాం టి పరిణామాలు చోటుచేసుకోలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో టీడీపీకి నాయకులకు గట్టి ఎదురు దెబ్బ తగులుతూనే ఉంది. ఎక్కడా పనులు కావడంలేదని, తమను టీడీపీ వాళ్లగా చూడటంలేదని నాయకులు, కార్యకర్తలు బహిరంగంగా మాట్లాడుతున్నారు. నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో టీడీపీ క్యాడర్ ఉన్నా చిన్నపాటి పనులు కూడా చేయలేకపోయాననే బాధలో మీనాక్షినాయుడు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కూటమి ఎమ్మెల్యే పార్థసారథి మాత్రం ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడుతూ 23 రోజుల్లోనే ఎమ్మెల్యే అయిన వ్యక్తికి ఆదోని నియోజకవర్గం గురించి ఏమి తెలుసునని టీడీపీ సీనియర్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.


మీనాక్షి నాయుడుతో జిల్లా అధ్యక్షుడు

### కార్యకర్తలకు స్వేచ్ఛ ఇవ్వాలి..

టీడీపీ అధిష్టానం చొరవ తీసుకుని నియోజకవర్గంలోని కార్యకర్తలకు పూర్తిస్థాయి స్వేచ్ఛని ఇవ్వాలంటున్నారు. ఇటీవల బీజేపీలో చేరిన వైసీపీ నాయకులకే పట్టం కట్టడమేంటంటూ ప్రశ్నిస్తున్నారు. వైసీపీ పరిపాలనలో ఐదేళ్ల పాటు కేసులు, దాడులతో ఇబ్బందులు పడ్డామని, మళ్లీ వాళ్లే బీజేపీ వచ్చి పెత్తనం చెలాయించడం ఎంతవరకు భావ్యమంటూ అధిష్టానానికి పలువురు ఫిర్యాదు చేశారు. జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి ఇదేవిషయంపై చర్చించినట్లు సమాచారం. తిక్కారెడ్డి మీనాక్షి నాయుడు ఇంట్లో ఉన్నాడని తెలుసుకున్న కార్యకర్తలు అక్కడికి చేరుకొని ఆదోని విషయంపై ప్రశ్నల వర్షం కురిపిం చినట్లు తెలిసింది. ఆదోని కార్యకర్తలను టీడీపీ అధిష్టానం నట్టేట ముంచుతోందని తమ ఆవేదనను వెళ్లగక్కారు. త్వరలో మంచి నిర్ణయం తీసుకుంటామని, కార్యకర్తలకు అన్ని విధాల న్యాయచేస్తామని హామీఇచ్చి వెళ్లినట్లు తెలిసింది.

## రాఘవేంద్రుని సన్నిధిలో ఉపేంద్ర

మంత్రాలయం, మే 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామిని తెలుగు, కన్నడ సినీనటుడు ఉపేంద్ర ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనతో పాటు కన్నడ సినీనటి తార కూడా స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి దర్శనార్థం వచ్చిన వీరికి మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషీ, సురేష్ కోనాపూర్, అనంతపురాణిక్, శ్రీపతాచార్, ఐపి నరసింహమూర్తి, రవి కులకర్ణి, ద్వారపాలక అనంతస్వామి, పవనాచార్ తదితరులు పాల్గొన్నారు.


పీఠాధిపతి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న నటుడు ఉపేంద్ర

# సేవకు ప్రతిరూపాలు..



- అంకితభావంతో విధులు
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

**కర్నూలు హస్పిటల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** తెల్లని మల్లెపువ్వు లాంటి దుస్తులు.. నెత్తిన చిన్న టోపీ.. చెరగని చిరునవ్వు.. ఆప్యాయమైన పలకరింపుతో మన కళ్లెదుట కదలాడే సేవామూర్తులు.. మన నర్సులు. వయస్సులో చిన్న వారైనా, పెద్దవారైనా ఎంతో గుండె ధైర్యంతో రోగిలో భరోసా నింపే చల్లని నేస్తాలు వారు. వార్డులోని రోగులే జగమంత కుటుంబంగా భావిస్తూ తల్లిలా, సోదరిలా సపర్యలు చేసే మానవతామూర్తులు. ఎన్నో సందర్భాల్లో మేమున్నామనీ నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివి. నర్సింగ్ వృత్తికి హుందాతనాన్ని తెచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ మే 12వ తేదీ 1820న జన్మించారు. నర్సింగ్ వ్యవస్థను స్థాపించిన ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను స్మరిస్తూ ప్రతిఏటా మే 12న నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. టర్కీలో క్రిమియన్ యుద్ధంలో బ్రిటిష్, మిత్ర రాజ్యాల సైనికులకు ఫ్లోరెన్స్ కీలకమైన సహాయాన్ని అందించినట్లు చరిత్ర చెబుతోంది.

### ఉమ్మడి జిల్లాలో 1,500 మంది

ఉమ్మడి జిల్లాలో 1500 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లాలోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 105 మంది, నంద్యాల జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో 150 మంది, సీహెచ్‌సీల్లో 150 మంది, కర్నూలు జీజీహెచ్, నంద్యాల జీజీహెచ్, ఆదోని జీజీహెచ్‌లో వేయి మంది ఎంసీహెచ్ పరిధిలో ఎస్ఎస్‌సీయ, ఎన్ఆర్‌సీ, ఎన్ఐసీయుల్లో 50 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు పని చేస్తున్నారు. కర్నూలు జీజీహెచ్‌లో 42 మంది హెడ్ నర్సులు రెగ్యులర్ స్టాఫ్ నర్సులు 99 మంది, ఓల్డ్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు 319 మంది, ఎన్‌హెచ్ఎం, ట్రామకేర్ కింద 50 మంది పని చేస్తున్నారు. కొత్తగా వచ్చిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 25 మంది నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.




### నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తించాలి



తెలంగాణ ప్రభుత్వం నర్సులను నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తించింది. అలాగే ఏపీలో కూడా నర్సులను ప్రభుత్వం నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తించాలి. అదే హోదాతో పిలవాలి. ప్రభుత్వం త్వరగా నర్సులను నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలి. 32 సంవత్సరాలుగా నర్సింగ్ వృత్తిలో కొనసాగుతున్నా. గోనెగండ్ల పీహెచ్‌సీలో నెలకు 30 డెలివరీలు నిర్వహిస్తుండటం ఎంతో సంతృప్తిని ఇస్తోంది. కర్నూలు జీజీహెచ్‌లో కరోనా సమయంలో రోగులకు సేవలందించా.

- ఎన్.లక్ష్మీనరసమ్మ, హెడ్ నర్సు, గోనెగండ్ల పీహెచ్‌సీ

### తల్లికి ఆనందం.. మాకు తృప్తి



ప్రసవం అనంతరం పుట్టిన బిడ్డను తల్లి చేతిలో పెట్టినప్పుడు కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని లేబర్‌రూంలో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తిని ఇస్తుంది. ప్రతి రోజు 15 నుంచి 16 వరకు కాన్పులు జరుగుతాయి. గర్భిణులకు, బాలింతలకు సేవలు చేయడం సంతోషాన్ని ఇస్తుంది.

- ఎం.కళ్యాణి, స్టాఫ్ నర్సు, కర్నూలు జీజీహెచ్

### సేవ చేయాలనే సంకల్పంతోనే



సేవ చేయాలనే సంకల్పంతోనే నర్సు వృత్తిని ఎంచుకున్నా. గౌరవానికి ప్రతీక నర్సు వృత్తి. కర్నూలు జీజీహెచ్‌లో 2010లో ఏఎంసీకి ఇన్‌చార్జిగా అత్యవసర రోగులకు సేవలందించాను. ఆసుపత్రికి క్యాజువాల్టీ ఏఎంసీ అనేవి రెండు కళ్లలాంటివి. అందుకే రెండు విభాగాల్లో ఎక్కువగా పని చేసేందుకు ముందు ఉన్నా. పత్తికొండ సీహెచ్‌సీ నుంచి కర్నూలు జీజీహెచ్‌కు కరోనా సమయంలో వచ్చా. ఆ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను తెగించి విధులు నిర్వహించాను. రెండుసార్లు కోవిడ్ పాజిటివ్ వచ్చినా ధైర్యంతో బాధ్యతలు నిర్వహించాను.

- ఎస్.పి.సావిత్రీబాయి, నర్సింగ్ సూపరింటెండెంట్, కర్నూలు జీజీహెచ్.




### కరోనా సమయంలో సేవలు



కరోనా సమయంలో ప్రాణాలను తెగించి పని చేశాను. మేల్ నర్స్‌గా ప్రత్యక్షంగా సేవ చేయడమే కాకుండా పరోక్షంగా రోగులకు ఆక్సీజన్ అందుబాటులో ఉండేలా వారికి అవసరమైన బెడ్స్ అందించడం ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ నర్సుగా సేవలు చేశాను. ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్‌గా కర్నూలు జీజీహెచ్‌లో ఆర్గాన్ డోనేషన్ జరిగిన సందర్భం ఎంతో సంతృప్తినిచ్చింది.

- సంపత్ కుమార్, కర్నూలు జీజీహెచ్

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

**వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి**



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

**కర్నూలు న్యూసిటీ, మే 11(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో మంత్రి నారా లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి విడుదల రజనిపై పోలీసులు దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. రాజకీయ, ముఖ్యమంత్రిగా అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు ఈవిషయంలో ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. 84సంవత్సరాల మాజీ ఎమ్మెల్యే చెన్నకేశరెడ్డిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అతి ఉత్సాహంతో పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు రాఘవేంద్రనాయుడు, ధనుంజయ ఆచారి, షరీఫ్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నిలుద్దాం

- టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య
- కొనసాగుతున్న 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్



జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

**కర్నూలు కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** పాకిస్థాన్ కవ్వింపులు, కాల్పులకు పాల్పడితే 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని ప్రధాని మోదీ ప్రకటించారని, అందుకు పౌరులు మద్దతుగా నిలవాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పిలుపునిచ్చారు. టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న 'జై జవాన్ కల్చరల్ ఫెస్ట్' రెండో రోజు కార్యక్రమాలు ఆదివారం రాత్రి కొనసాగాయి. ఈ సందర్భంగా కళాకారుల దేశభక్తిని ప్రబోధించే పాటలు, కళారూపకాలు, దేశభక్తి గేయాలు ప్రత్యేకంగా నిలిచాయి. కళాకారులు, గాయకులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాంజనేయ యుద్ధం వార్‌సీన్‌లో రామునిగా నటించిన మొగలివల్లి రవికుమార్ భరతమాత చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, దేశభక్తిని చాటిచెప్పారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ దేశంలో యుద్ధ వాతావరణం ఇంకా ముగియలేదని, సైనికులు అప్రమత్తంగా ఉంటూ దేశాన్ని కాపాడాలని మోదీ పిలుపు నిచ్చారని గుర్తు చేశారు. సైన్యానికి భారత ప్రజల మద్దతు, ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని, ఈ నేపథ్యంలోనే భారత జవాన్లకు మద్దతుగా, వారికి సంఘీభావం తెలుపుతూ ఈనెల 16 వరకు జై జవాన్ సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. రెండో రోజు కార్యక్రమాల్లో నాట్యాచార్యుడు నారాయణ స్వామి శిష్యబృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలాగే సంగా ఆంజనేయులు, కె.బాలవెంకటేశ్వర్లు, వాల్మీకి రాముడు సైనికుల వేషధారణలో ప్రదర్శనలు ఇచ్చారు. గాయకులు మహ్మమద్ మియా, చంద్రకంటి మద్దయ్య బృందం ఆలపించిన దేశభక్తి గీతాలు ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అనంతరం మొలగవల్లి రవికుమార్ శ్రీరామునిగా, నెల్లూరు ఈశ్వర్‌గౌడ్ ఆంజనేయుడుగా నటించిన శ్రీరామాంజనేయ యుద్ధం (వార్‌సీన్) నాటకం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాసమితి పూర్వ అధ్యక్షులు పి.దస్తగిరి, నారాయణ స్వామి, కార్యక్రమం కన్వీనర్ పి.రాజారత్నం, సభ్యులు వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **నేడు కవయిత్రుల సమ్మేళనం :** జై జవాన్ కల్చరల్ ఫెస్టివల్ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సాయంత్రం డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, కా.వెం. సుబ్బలక్ష్మమ్మ, సునీతల ఆధ్వర్యంలో దేశభక్తిని ప్రబోధించే కవయిత్రుల సమ్మేళనం, దేశభక్తి గీతాల ఆలాపనలు ఉంటాయి.



భరతమాత చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న రాముని పాత్రధారి

## భార్య మృతితో ఆత్మహత్యాయత్నం

**కోలుకోలేక భర్త మృతి.. అనాథలుగా మారిన పిల్లలు**

**దేవనకొండ, మే 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పి.కోటకొండ గ్రామంలో భార్య మృతి వార్తతో ఆత్మహత్యాయత్నం చేసిన భర్త కోలుకోలేక మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన మేరకు.. ఈ నెల 1వ తేదీన కురువ అరుణ(25) మృతిచెందింది. భర్త పులకుర్తి కురువ సూర్యప్రతాప్(29) పొలంలో పని చేసుకుంటుండగా భార్య మృతి వార్త విని మనస్తాపంతో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం కర్నూలు వైద్యశాలలో మృతి చెందాడు. తల్లిదండ్రుల మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలు కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అవేదన వ్యక్తంచేశారు. తండ్రి పులకుర్తి రామాంజినేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## సైన్స్‌పై దృష్టి పెట్టాలి

- మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం
- ప్రజల్లో శాస్త్రీయ అంశాలు పెంపొందించాలి
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్
- జేవీవీ ప్రాంతీయ వర్క్‌షాప్



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం

**డోన్ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** భారతదేశంలో అభివృద్ధితో పాటు సైన్స్‌పై దృష్టి పెట్టాలని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) వ్యవస్థాపక నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీసుధ పాఠశాలలో ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల జేవీవీ ప్రాంతీయ వర్క్‌షాపు జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆవేదిక జెండాను బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ఆయన మాట్లాడారు. శాస్త్ర పరిశోధనలకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. మానవుడు ప్రకృతి రహస్యాలను ఛేదిస్తూ అందులోని భౌతిక సూత్రాలను కనుగొంటూ ఆధునిక మానవునిగా ప్రసిద్ధి చెందాడన్నారు. అనంతరం జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ అంశాలు పెంపొందిం చేందుకు ప్రతి పౌరుడిని కృషిచేయాలని అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వడగాల్పుల ప్రదేశాల్లో శీతల కుటీరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జేవీవీ జిల్లా ప్రధానకార్యదర్శి మాణిక్యంశెట్టి, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రంగన్న, రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్, నాలుగు జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామిరెడ్డి, లక్ష్మినారాయణ, ఆదిశేషు, మహేంద్రరెడ్డి, ఖాజా హుశేన్, ప్రసూన, వెంకటేశ్, హనీఫ్, సర్వజ్ఞమూర్తి, లతీఫ్, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## కనులపండువగా నారసింహుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

**కోడుమూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ముడుమలగుర్తిలో లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం కనులపండువగా జరిగింది. వార్షిక ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం ఆలయంలో అభిషేకాలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం పురోహితులు వేదమంత్రోచ్చారణలతో స్వామిఅమ్మవార్లకు కల్యాణం జరిపించారు. సోమవారం ముగ్గులు, ఎద్దులు బండలాగుడు పోటీలు, మంగళవారం పొట్టేళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

**ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్**



వేల్పనూరులో ముఖ్య నాయకులతో సమావేశమైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్

**వెలుగోడు, మే 11 (ఆంధ్రజ్యోతి):** టీడీపీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మంత్రి శనివారం రాత్రి వేల్పనూరుకు చేరుకున్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఇంట్లో బసచేశారు. ఆదివారం ఉదయం నియోజకవర్గంలోని పలు ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమిస్తున్న ప్రతి నాయకుడికి న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో శ్రీశైలం నియోజకవర్గంలో కష్టపడిన నాయకులను అభినందించారు. తెలుగుగంగ ఉద్యోగులు మంత్రిని కలిసి తమకు రెగ్యులర్ చేయాలని, కొంతమంది కాంట్రాక్టర్లు బిల్లులు అందడం లేదని, సకాలంలో అందేలా చూడాలని, వెలుగోడు పట్టణానికి చెందిన పలు మైనార్టీలు, ఈద్గా రేఖియాబీ దర్గా, మసీదు నిర్మాణం కోసం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని మంత్రిని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే బుడ్డా సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్‌కలాం, ఖలీల్, రసూల్, సురేశ్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

## ముళ్ల పొదల తొలగింపు



జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు

**కర్నూలు న్యూసిటీ, మే 11(ఆంధ్రజ్యోతి):** జొహరాపురం సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న కమ్యూనిటీ భవనాల ప్రాంగణంలో ముళ్ల పొందల తొలగింపు వేగవంతం చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం భవనాల వద్ద జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టామని, రెండు రోజుల్లో పనులను పూర్తి చేస్తామని కమిషనర్ వెల్లడించారు.

## నేడు నగర పాలకలో వినతుల స్వీకరణ

**కర్నూలు న్యూసిటీ, మే 11(ఆంధ్రజ్యోతి):** నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ప్రమాదకర రసాయనాల నుంచి పర్యావరణం కాపాడుకోవాలి

**కర్నూలు న్యూసిటీ, మే 11(ఆంధ్రజ్యోతి):** పరిశ్రమల నుంచి వెలువడే ప్రాణాంతక రసాయనాల నుంచి ప్రజలు ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంద్‌బాబు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రాణాంతక రసాయనాల ప్రమాదం నుంచి ప్రజల ప్రాణాలు, పర్యావరణాన్ని కాపాడుకుందాం..! అనే అంశంపై ఆదివారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాక్రిష్ణ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడారు. కొత్త రకమైన రాసాయన ఉత్పత్తి కోసం పరిశ్రమలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రయసానాల ఉత్పత్తి ద్వారా వచ్చే వ్యర్థాలు మానవ మనుగడకే ప్రమాదంగా మారబోతున్నాయని అన్నారు. 12న కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, కన్వీనర్ రామకృష్ణ, విశ్రాంత అధ్యాపకులు రమేష్, టీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు రత్నం, ఏసేపు, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పాల్గొన్నారు.

## నగర పాలక ఎస్‌ఈగా శేషసాయి

**కర్నూలు న్యూసిటీ, మే 11(ఆంధ్రజ్యోతి):** నగరపాలక సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్‌ఈ)గా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషసాయికి పూర్తి అదనపుబాధ్యతలు కేటాయిస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఈ రాజశేఖర్‌ను పరిపాలన సౌలభ్యం కింద రెండు రోజుల క్రితం ఈఎన్‌సీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో శేషసాయికి ఎస్‌ఈగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరంలో బిస్కెట్లు పంపిణీ

**కర్నూలు కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** పాత నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి పునశ్చరణ తరగతుల్లో ఆదివారం విద్యార్థులకు దాతల సహాయంతో బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ వి. పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డిల ఆధ్వర్యంలో దాతలు టి. మద్దిలేటి, సి. రామచంద్రయ్య, ఎస్ శ్రీనివాసులు, ఎం. సురేష్, ఇ. శేషయ్య, విజయ నరసింహయ్యల సహకారంతో వాటిని పంపిణీ చేశారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి. పెద్దక్క మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి పునశ్చరణ తరగతులకు విశేష స్పందన లభిస్తోందని, ప్రస్తుతం వందమందికి పైగా విద్యార్థులు ఆంగ్లంలో గ్రామర్, హిందీ భాష శిక్షణ, చిత్రలేఖనం, బొమ్మలు తయారు చేయడం, పుస్తక పఠనం, గణితం, సైన్స్ తదితర అంశాల్లో శిక్షణలు అందుకుంటున్నారని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మానసికోల్లాసానికి క్రీడలు ఉపయోగకరం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు

**ఓర్వకల్లు, మే 11 (ఆంధ్రజ్యోతి):** మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని గ్రీన్ కో సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని శకునాల గ్రామంలో శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొదటి నుంచి 5 బహుమతులు వరుసగా రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదును అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామనాయకుడు మహేశ్వరరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

## సమస్యల్లో మజరా గ్రామాలు



సీసీరోడ్లు లేని ఎర్రగుంట కొట్టాల

**సి, బెళగల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మజరా గ్రామాల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. నేటికీ చాలా గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. ముఖ్యంగా ఎర్రగుంటకొట్టాల, క్రిష్ణదొడ్డి, బ్యాదోళి పల్దొదొడ్డి గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. సరైన రోడ్లు, నీటివసతి సౌకర్యాలు లేక విలవిలలాడుతున్నారు. 300లోపు జనాభాగల గ్రామాలను సమీప పంచాయతీలకు అనుసంధానం చేసి అభివృద్ధి కోసం నిధులు విడుదల చేస్తోంది. అయితే ప్రభుత్వం కేటాయించిన అరకొర నిధులతో మజరా గ్రామాల్లో అభివృద్ధి కొరవడింది. ఎర్రగుంటకొట్టాల గ్రామంలో 278 మంది నివసిస్తున్నారు. వారంతా వ్యవసాయ కూలీలే. నేటికీ గ్రామానికి సరైన రోడ్లు లేవు. దీంతో ప్రజలు, విద్యార్థులు పట్టణానికి వెళ్లాలంటే ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిందే. గ్రామంలో మంచి నీటి బోర్లు రెండు వేశారు. కానీ అవి తాగడానికి పనికి రావు. దీంతో బోరుబావుల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. గ్రామంలో చాలా మందికి గృహాలు మంజూరు కాక పూరి గుడెసెల్లోనే నివాసం ఉంటున్నారు. సామూహిక మరుగుదొడ్లు లేక ముళ్లపొదల్లో వెళ్లాల్సిన వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మజరా గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

# ధ్యానం ఆచరిస్తే ప్రశాంత జీవితం

- బుద్ధవిగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందదాయకం
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ప్రతిఒక్కరూ ధ్యాన కేంద్ర సేవలను వినియోగించుకోవాలి
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- ఘనంగా బుద్ధుడి విగ్రహావిష్కరణ



బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్, గౌరు చరిత

**కర్నూలు కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ ధాన్యం ఆచరిస్తే ప్రశాంత జీవితం పొందవచ్చునని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని రాఘవేంద్రనగర్ లోగల దికర్నూలు స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలోని బుద్ధా పిరమిడ్ ధ్యానకేంద్రంలో ఏర్పాటుచేసిన బుద్ధుని విగ్రహాన్ని టీజీ వెంకటేశ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, బుద్ధా పిరమిడ్ కేంద్ర అధినేత, చిత్ర నిర్మాత బ్రహ్మరిషి డాక్టర్ బీవీ రెడ్డితో కలిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన బుద్ధవిగ్రహాన్ని ఈరోజు ఆవిష్కరించుకోవడం ఆనందదాయకమని అన్నారు. మహనీయుల నుంచి స్ఫూర్తి పొందేందుకు వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటామన్నారు. ఎన్నోవేల కోట్ల రూపాయలు సంపాదించే అవకాశం ఉన్నప్పటికీ బీవీ రెడ్డి ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకొని, కర్నూలు నగరంలో మొట్టమొదటి సారిగా పిరమిడ్ ధాన్య కేంద్రం ఏర్పాటుకు కృషి చేశారని గుర్తుచేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలకు పిరమిడ్ ధ్యాన కేంద్రం ద్వారా ప్రశాంతమైన జీవనాన్ని తెలియజేస్తూ ముందుకుపోతున్న బీవీ రెడ్డి చేపట్టే ప్రతి కార్యక్రమం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో లభించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుద్ధా పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. బుద్ధుని విగ్రహం ఏర్పాటుతో ధ్యాన కేంద్రానికి ప్రత్యేకత సంతరించుకుందన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త రవీంద్రారెడ్డి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, న్యాయవాది దాశెట్టి శ్రీనివాసులు, వార్డు టీడీపీ నాయకురాలు శైలజాయాదవ్, నాయకులు శ్రీనివాసరావు, జవ్వాజి గంగాధర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి




వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆపస్ నాయకులు

**కర్నూలు ఎడ్యుకేషన్, మే 11 (ఆంధ్రజ్యోతి):** భారత్- పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధంలో తన ప్రాణాలను అర్పించి అమరత్వాన్ని పొందిన వీర జవాన్ మురళీనాయక్‌కు, దేశరక్షణలో ప్రాణాలర్పించిన సమస్త వీరజవాన్లకు కర్నూలు జిల్లా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా శాఖ తమ కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆపస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్నతనం నుంచి దేశభక్తి హృదయంలో నింపుకొని, భారత సైన్యంలో చేరి దేశ రక్షణ కోసం పోరాడుతూ సుమారు 14 మంది ఉగ్రవాదులను హతమార్చి వీర మరణం పొందిన మురళీనాయక్ భారతమాతకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా అధ్యక్షులు చిన్ననాగ స్వామి నాయక్, ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జేవీఆర్ శెట్టి, జిల్లా కార్యాలయ కార్యదర్శి సంపత్ కుమార్, కల్లూరు మండల అధ్యక్షులు శ్రీనివాసులు, కొందరు ఆపస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠభరితంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఫెస్టివల్ కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి

**ఓర్వకల్లు, మే 11 (ఆంధ్రజ్యోతి):** ఓర్వకల్లులోని శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రైతు సంఘం, దాతల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాష్ట్ర పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీలను ఫెస్టివల్ కమిటీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి ప్రారంభించారు. మొదటి విజేతగా కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన రైతు మహిళ ఆకేపోగు వరలక్ష్మి ఎద్దులు రూ.50వేల నగదును కైవసం చేసుకుంది. రెండో విజేతగా తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా ఉండవల్లి గ్రామానికి చెందిన ఆంజనేయరెడ్డి ఎద్దు లు రూ.40వేలు, మూడో విజేతగా కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామానికి చెందిన ఎక్స్‌ఆర్మీ బోరెడ్డి నారాయణరెడ్డి ఎద్దులు రూ.30వేలు, నాలుగో విజేతగా నంద్యాల జిల్లా మిడుతూరు మండలం వీరేష్‌గౌడు రూ.2వేలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఫెస్టివల్ కమిటి సభ్యులు వెంకటరమణారెడ్డి, దేవయ్య, మంగలి రవిశంకర్, నాయకులు రాంభూపాల్ రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీరాములు, అల్లాబాబు, శ్రీరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు

## ఘనంగా వక్ఫ్‌బోర్డు చైర్మన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న రోజా దర్గా పీఠాధిపతి దాదాబాషా ఖాద్రి తదితరులు

**కర్నూలు కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ జన్మదిన వేడుకలను ఆదివారం కర్నూలులో ఘనంగా నిర్వహించారు. నగరంలోని సనా ఫంక్షన్‌హాలులో వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర్ సయ్యద్ మహమ్మద్ పీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రోజా దర్గా పీఠాధిపతి దాబాబాషా ఖాద్రి కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ యునాని మెడికల్ హాస్పిటల్ చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యునాని మెడికల్ హాస్పిటల్ ప్రిన్సిపల్ డాక్టర్ జైనుల్లాబుద్దీన్, టీడీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు సయ్యద్ అబ్బాస్, టీడీపీ బూత్ ఇన్‌చార్జి మునావర్ బాషా, సయ్యద్ మహ్మద్ పీర్ పాల్గొన్నారు.

## బాలికలు యుద్ధ క్రీడల్లో రాణించాలి




మదర్స్‌డే సందర్భంగా తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేస్తున్న శమంతకమణి

**కర్నూలు కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** బాలికలు, యువతులు యుద్ధ క్రీడల్లో రాణించాలని కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి అన్నారు. ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా, నగరంలోని కొండారెడ్డి బురుజు సమీపంలోని కేఎంపీ పార్కు కాంప్లెక్స్ ఆవరణలో తైక్వాండో క్రీడాకారులకు బెల్టుల ప్రదానం చేశారు. ఆమెకు తైక్వాండో క్రీడాకారులు మదర్స్‌డే శుభాకాంక్షలు తెలిపి, శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తైక్వాండో క్రీడ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి. వెంకటేశ్వర్లు, శిక్షకులు తేజ, అజయ్, తిలక, అఖిల్, సాయికృష్ణ, నందిని, అశ్విని, శ్రీలిత, భార్గవ్, మల్లేష్, విశ్వాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి లక్ష్మీపురంలో చౌడేశ్వరీదేవి విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలు

**కల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి):** కల్లూరు మండలం లక్ష్మీపురంలో చౌడేశ్వరీదేవి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నట్లు తొగటవీర క్షత్రీయ సేవాసంఘం, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. లక్ష్మీపురం చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, కలశ, నాగదేవత ప్రతిష్ఠ నేటి నుండి 16 వరకు జరుగుతాయన్నారు. సోమవారం గణపతిపూజ, 13న ప్రాతఃకాల పూజ, నవగ్రహ పూజ, 14న శ్రీచౌడేశ్వరీదేవి నూతన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్థంభ ప్రతిష్ఠ, 15న జ్యోతుల మహోత్సవం, 16న అగ్నిగుండ ప్రవేశముతో అమ్మవారికి జ్యోతుల సమర్పణ జరుగుందన్నారు. ఈ వేడుకలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు అక్కెం నరహరిదాసు, అక్కెం శేఖర్, పాణ్యం రామకృష్ణ, అక్కెం రామకృష్ణ, అక్కెం మురళీధర్, అక్కెం జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు.

## అమడకుంట్లలో ఐఎంఏ వైద్యుల శిబిరం

● 350 మంది మహిళలకు పరీక్షలు



వైద్యశిబిరం నిర్వహిస్తున్న కర్నూలు ఐఎంఏ మహిళా వైద్యులు

**కర్నూలు హాస్పిటల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్స్ డాక్టర్స్ వింగ్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం సందర్భంగా కోడుమూరు మండలం అమడకుంట్లలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 350 మంది మహిళలకు కర్నూలు జీజీహెచ్ జనరల్ సర్జన్ ప్రొఫెసర్, ల్యాప్రోస్కోపి సర్జన్ డా.మాధవి శ్యామల, గైనకాలజిస్టు ఇన్‌ఫెర్టిలిటి సర్జన్ డా.పి.విష్ణుప్రియ, గైనకాలజిస్టు ఇన్‌ఫెర్టిలిటి స్పెషలిస్టు డా.డి.విజయలక్ష్మి, నెఫ్రాలజిస్టు డా.సాయివాణి, కంటి వైద్యనిపుణులు డా.స్ఫూర్తిరెడ్డి పరీక్షలు నిర్వహించారు. ఐఎంఏ ఉమెన్స్ డాక్టర్స్ వింగ్ ప్రెసిడెంటు డా.మాధవి శ్యామల మాట్లాడుతూ అమడకుంట్లలో జరిగిన వైద్యశిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. థైరాయిడ్స్, శరీరంలో కణితి, మహిళల సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. 35 మందికి కంటి ఆపరేషన్ అవసరమని అప్తామాలజిస్టు డా.స్ఫూర్తిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డా.సాయివాణి, పిడీయాట్రిషన్ డా.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి సాయం



చిన్నరాముడు భార్యకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

**కోడుమూరు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని లద్దగిరి గ్రామానికి చెందిన చిన్నరాముడు ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. 2003-04 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం గ్రామానికి చేరుకుని కుటుంబానికి ఆర్థికసాయం చేశారు. మృతుడి భార్య గంగావతికి రూ. 33,500 అందజేశారు. కార్యక్రమంలో రవిశేఖర్‌ఆచారి, ఖాజామినెళ్ల, రాజన్న, సోమన్న, సతీష్, మోహన్‌బాబు, శాలప్పనాయుడు పాల్గొన్నారు.

## చెస్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**కల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి):** చెస్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణతో పాటు మేధాశక్తి పెరుగుతుందని ఏడిపై స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్. జోసఫ్ డేవిడ్ పేర్కొన్నారు. ఆదివారం నగర పరిధిలోని దూపాడులో జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ సంస్థ, ఏడిపై స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్. జోసఫ్‌డేవిడ్ మాట్లాడుతూ చెస్‌పోటీల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం చెస్ పోటీల్లో గెటుపొందిన విద్యార్థులకు ఏడిపై స్కూల్ యాజమాన్యం బహుమతులు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు డాక్టర్. మనోజ్‌కుమార్, డాక్టర్. సతీష్‌కుమార్, డాక్టర్. గాంధీరెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీం సభ్యులు, జీవన్, భరత్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గరుడోత్సవం



ఓర్వకల్లులో నృత్యం చేస్తున్న శారద సంగీత నృత్య కళాశాల విద్యార్థులు

**ఓర్వకల్లు, మే 11 (ఆంధ్రజ్యోతి):** స్థానిక శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం గరుడోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రాతఃకాల పూజ, అర్చన హోమం, బలిహరణం, ప్రభోత్సవం, గరుడోత్సవ పూజలకు అర్చకులు విష్ణుశర్మ, నారాయణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పల్లకిలో ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. శారద సంగీత నృత్య కళాశాల వారిచే లక్ష్మి కల్యాణం, కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన నిర్వహించారు. అలాగే సీతారామ చెక్కభజన బృందం రామకృష్ణ వారిచే నిర్వహించిన చెక్కభజన కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఫెస్టివల్ కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి, వెంకటరమణారెడ్డి, లలితమ్మ, కురువ లక్ష్మిదేవి, వడ్డె భువనేశ్వరి, బోయ లక్ష్మిదేవి, దేవయ్య, మంగళి రవిశంకర్, గుర్రం రత్నమ్మ, నాయకులు గోవిందరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, అబ్దుల్లా, అల్లాబాబ పాల్గొన్నారు.

## భక్తిభావం అలవర్చుకోవాలి: ఎమ్మెల్యే



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

**ఓర్వకల్లు, మే 11 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకుంటే సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉంటారని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నన్నూరు బస్టాండు ప్రాంతంలో ఏబీఎం తెలుగు బాప్టిస్ట్ చర్చిని ఆమె ప్రారంభించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 40 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, విజయుడు, ఖాజామియా, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

## కర్రసాము శిక్షణతో ఆత్మస్థైర్యం



సిలంబం విద్య ఆడుతున్న విద్యార్థులు

**కర్నూలు స్పోర్ట్స్, మే 11 (ఆంధ్రజ్యోతి):** కర్రసాము (సిలంబం) శిక్షణతో ఆత్మస్థైర్యం పెరుగుతుందని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక బాలశివ డిగ్రీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన కర్రసాముపై వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా క్రీడల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, సిలంబం జిల్లా కార్యదర్శి రాఘవేంద్రతో పాటు సిలంబం కోచ్‌లు రాఘవేంద్ర పాల్గొన్నారు.

## 13 నుంచి రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలు



లోగోను ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్, కోచ్ టి.శ్రీనివాసులు

**కర్నూలు స్పోర్ట్స్, మే 11 (ఆంధ్రజ్యోతి):** జిల్లా ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీ.క్యాంపులోని టీజీ లక్ష్మీవెంకటేశ్ కల్యాణ మండపంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఉషూ పోటీలకు సంబంధించిన లోగోను మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 13, 14తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు తమవంతు సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉషూసంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు, ఒలంపిక్‌సంఘం అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, తైక్వాండో సంఘం ప్రతినిధులు సతీష్ కుమార్, వీరేష్‌బాబు, మాస్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

## క్రీడల అభివృద్ధికి సహకరిస్తా

నగరంలో క్రీడల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం స్థానిక సుంకేసుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ర్యాలీ స్పోర్ట్స్ బ్యాడ్మింటన్ అకాడమీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు విజయరాజ్, రాధారాణి పాల్గొన్నారు.

## 'ఉద్యోగుల సమస్యలు వినండి'



**కర్నూలు కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగుల సమస్యల సాధనకై గతంలో ప్రతి నెల మూడో శుక్రవారం సమస్య పరిష్కార వేదిక నిర్వహించేవారు. అయితే కొంత కాలం నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం లేదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగ సంబంధ అంశాలైన సెలవులు, జీతభత్యాలు, ఇతర సర్వీసు అంశాలపై గతంలో ప్రతి నెలా మూడో శుక్రవారం కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ వేదికను నిర్వహించేవారు. ఈ వేదిక ద్వారా జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం పొందేవారు. మరోసారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

## ఉచిత వైద్యశిబిరం

**కర్నూలు హాస్పిటల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న (కైలాస స్పెషాలిటీ క్లినిక్‌లో మాతృ దినోత్సవం సందర్భంగా కార్డియోథోరాసిక్ సర్జన్ పీఎస్ఎస్ లక్ష్మణస్వామి, సీనియర్ కన్సల్టెంట్ రేడియాలజిస్టు డా.పి.నిహారిక ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 50 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, టుడి ఇకో పరీక్షలు నిర్వహించారు. సీటీ సర్జన్ డా.లక్ష్మణ స్వామి మాట్లాడుతూ ఇప్పటి వరకు 5వేల మందికి ఓపెన్‌హార్ట్ సర్జరీలు నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ గుండె సమస్యలు రాకుండా రోజు 45 నిమిషాలు వ్యాయామం చేయాలని, ఒత్తిడికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

## సీపీఎం నాయకుల పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

**ఆదోని రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు మూడు రోజుల పాదయాత్ర ప్రారంభించారు. ఆదివారం ఉదయం పెద్దతుంబళంలో పాదయాత్రను ఆ పార్టీ సీనియర్ నాయకుడు రామాంజనేయులు ప్రారంభించగా, సాయంత్రం దొడ్డనగేరికి చేరుకొంది. తమకు తాగునీరు ఇవ్వాలని ప్రజలు ప్రాధేయపడడం పాలకుల వైఖరికి నిదర్శమన్నారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకులు నేటి జనాభాకు అనుగుణంగా లేవని, నూతన ఎస్ఎస్ ట్యాంకులను నిర్మించాలని డిమాండ్ చేశారు. లింగన్న, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## మహిళలు, బాలికల కోసమే శక్తి యాప్


శక్తియాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసులు

**మద్దికెర, మే 11 (ఆంధ్రజ్యోతి):** మహిళలు, బాలికల భద్రత కోసమే శక్తి యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని ఎస్ఐ విజయకుమార్ నాయక్ అన్నారు. ఆదివారం గ్రామంలో మహిళలు, యువతుల సెల్‌ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఆపదలో యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం వెళ్తుందన్నారు. వారు వెంటనే ఆపదలో ఉన్నవారిని రక్షిస్తారన్నారు.

## అన్నదానం గొప్పది


జీవనజ్యోతి అనాథాశ్రమంలో అన్నదానం

**ఆదోని, మే 11 (ఆంధ్రజ్యోతి):** అన్ని దానాల కన్న అన్నదానం గొప్పదని సహృదయ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పెద్దయ్య, రఘు, గిరి, గౌడ్, సునీల్ రెడ్డి అన్నారు. ఆదివారం జీవనజ్యోతి అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. సభ్యులు అనిల్, శివారెడ్డి, చలపతి, తిరుమల రెడ్డి, ఉరుకుందప్ప పాల్గొన్నారు.

## ఉపాధి కోసం ఉద్యమించాలి

**దేవనకొండ, మే 11 (ఆంధ్రజ్యోతి):** ఉపాధి, ఉద్యోగాల కోసం యువత ఉద్యమించాలని సీపీఐ జిల్లా నాయకుడు మద్దిలేటి శెట్టి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని నల్లచెలిమల గ్రామంలో మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు లేక యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15 నుండి 18 వరకు తిరుపతిలో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నామని తెఇపారు. అనంతరం కార్యదర్శిగా కాశీ, అధ్యక్షుడిగా నగేష్, మరో 20 మందితో గ్రామ కమీటిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి నర్సారావ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగంపై నిరంతర తనిఖీలు

- మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్



**ఆదోని టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగంపై నిరంతరం తనిఖీలు చేస్తామని మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ ఆదివారం తెలిపారు. విక్రేతలతో పాటు, రవాణా చేసే పార్సెల్ సర్వీస్ యజమానులకు అవగాహన కల్పించామని, హెచ్చరికలు జారీచేశామన్నారు. ఆదోని పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా రూపొందించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజలు తక్కువ మైక్రాన్ గల ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు.

## శ్మశాన వాటికకు స్థలం ఇవ్వాలి

**తుగ్గలి, మే 11 (ఆంధ్రజ్యోతి):** వీరశైవ లింగాయత్‌లకు శ్మశాన వాటికకు స్థలం ఇవ్వాలని సొసైటీ రాష్ట్ర సాధికారిత సమితి సభ్యుడు బాధడ కౌశిక్ కుమార్ డిమాండః యుశారు. ఆదివారం జి.ఎర్రగుడిలో మాట్లాడుతూ రాష్ట్రంలోని టీడీపీ గెలుపు కోసమే తాము పనిచేశామన్నారు. రాష్ట్రంలో 18 లక్షలు, ఉమ్మడి జిల్లాలో 1.80 లక్షల మంది లింగాయత్ ఉన్నారని, మృతిచెందిన వారి దహన సంస్కారాలకు స్థలం కేటాయించాలని కోరారు.

## రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోండి

**వెల్దుర్తి మే 11 (ఆంధ్రజ్యోతి):** రేషన్‌కార్డు లేనివారు కార్డుకోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖరవర్మ సూచించారు. కొత్త కార్డు, కుటుంబ సభ్యుల విభజన, సభ్యుల చేర్పు, చిరునామా మార్పు, చనిపోయిన వారి పేర్ల తొలగింపుకు అవకాశం ఉందన్నారు. ఒంటరి మహిళలు, ఆశ్రమాల్లో ఉండేవారు కూడా అర్హుల న్నారు. దగ్గర్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డులు వస్తాయని తెలిపారు.

## పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు భాస్కర్

**ఆదోని అగ్రికల్చర్, మే 11 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ ఛైర్మన్‌ను నియమించి వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుమ్మల భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం కార్యాలయంలో మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ ముగిసినా, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్‌సీ ఆలస్యమైతే వెంటనే 30 ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏ, ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీటీఏ సీనియర్ నాయకులు జయరాం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# మొండి గోడలకే పరిమితం

- ఆగిపోయిన జంబో షెడ్ నిర్మాణం
- పత్తి తడిసి తీవ్రంగా నష్టపోతున్న రైతులు


పత్తి మార్కెట్‌లో మొండి గోడలకే పరిమితమైన జంబో కవర్డ్ షెడ్ ప్లాట్ ఫాం

**ఆదోని అగ్రికల్చర్, మే 11 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వానికి కోట్లలో ఆదాయాన్ని సమకూర్చే ఆదోని మార్కెట్ యార్డులో పనులు నిలిచిపోయాయి. జంబో షెడ్ పనులు ఆగిపోవడంతో మొండి గోడలు వెక్కిరిస్తున్నాయి. గత టీడీపీ హయాంలో పత్తి యార్డులోని ప్లాట్‌ఫాంలో రూ. 2కోట్లతో జంబో షెడ్ కవర్డ్ షెడ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాంట్రాక్టర్ సివిల్ వర్క్ కింద రూ. కోటిపైగా ఖర్చు చేసి గోడలు నిర్మించారు. అయితే పనులు పూర్తయ్యే సమయానికి ఎన్నికలు రావడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయి. వైసీపీ హయాంలో ఐదేళ్లుగా అలాగే మొండి గోడకే పరిమితమైంది. పత్తి దిగుబడులు వర్షానికి తడిసిపోతున్నాయి. భారీ వర్షాల దెబ్బకు పత్తి దిగుబడులు తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికి ఎనిమిది సార్లు టెండర్ పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. తిరిగి టీడీపీ అధికారంలోకి రావడంతో పనులు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

### త్వరలోనే పనులు పూర్తి చేస్తాం



పత్తి ప్లాట్‌ఫాం కవర్ షెడ్ నిర్మాణం సివిల్ పనులు పూర్తయ్యాయి. రూఫ్ లెవెల్‌లో ఇనుప రేకులు వేయాల్సి ఉంది. రూ.కోటితో షెడ్ ఇనుప రేకులు వేయడానికి టెండర్ పిలిచి, సీజన్ ఆరంభంలోపు పూర్తి చేస్తాం.

- సుబ్బారెడ్డి, డీఈ మార్కెటింగ్ శాఖ

## జవాన్ల కుటుంబాలకు ప్రభుత్వం అండ

- టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర



**తుగ్గలి, మే 11 (ఆంధ్రజ్యోతి):** దేశ రక్షణకు పోరాడే జవాన్ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నా రు. ఆదివారం తుగ్గలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాకిస్తాన్‌తో యుద్ధంచేసి అసువులు బాసిన వీర జవాన్ మురళీనాయక్ చిరస్మరణీయుడన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్‌లు స్వయంగా అంత్యక్రియల్లో పాల్గొని, కుటుంబ సభ్యులు ఓదార్చి, రూ.50లక్షల పరిహారం, 5ఎకరాల పొలం, ఇల్లు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం గౌరవప్రదమన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి ఉన్నారు.

## డబుల్ రోడ్లు అభినందనీయం

**ఆదోని టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలోని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం అభినందనీయమని టీడీపీ మాజీ కౌన్సిలర్, మండగిరి ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి అన్నారు. ఆదివారం మాట్లాడుతూ రాష్ట్రంలోని 4,450 కి.మీ.ల రహదారులు అభివృద్ధి చెందుతాయన్నారు. తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- ఆదోనిలో డిగ్రీ, వెల్దుర్తి, మద్దికెరలో పదో తరగతి విద్యార్థులు


వెల్దుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో..


మద్దికెర జడ్పీ ఉన్నత పాఠశాలలో..

**ఆదోని అగ్రికల్చర్, మే 11 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 1997-2000 బ్యాచ్ బీకాం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 25 ఏళ్ల అనంతరం తమ స్నేహితులను కలుసుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తాము చదివిన తరగతి గదిలోకి వెళ్లి తమ తోటి స్నేహితులతో నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వివిధ వృత్తులు, ప్రాంతాల్లో స్థిరప డిన వారంతా కలుసుకోవడం సంతోషంగా ఉందని నిర్వాహకులు రాయ చోటి సుబ్బయ్య, మంజునాథ్ ఉపేంద్ర తెలిపారు. కామర్స్ హెచ్‌వోడీ చంద్రశేఖర్, కళాశాల అధ్యక్షుడు సనత్ కుమార్‌ను సన్మానించారు


ఆదోని ఆర్ట్స్ కళాశాలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**2001-02 పదో తరగతి విద్యార్థులు..**

**వెల్దుర్తి:** జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు పద్మశ్రీ, రేవతి, ఫాతీమా, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, రఫిక్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. మిత్రుడు చెన్నకేశవులుకు రూ.30వేలు సాయం చేశారు.

**2004-05 బ్యాచ్ విద్యార్థులు..**

**మద్దికెర, మే 11 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాల 2004-05 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 20 ఏళ్ల అనంతరం కలిసి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులలను సన్మానించారు.

## రుణాలు చెల్లిస్తేనే సొసైటీల అభివృద్ధి


మాట్లాడుతున్న సొసైటీ ఛైర్మన్

**తుగ్గలి, మే 11 (ఆంధ్రజ్యోతి):** రైతులు తాము తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లిస్తేనే సొసైటీలు అభివృద్ధి చెందుతాయని మారెళ్ల సొసైటీ ఛైర్మన్ అశోక్ కుమార్, సీఈవో మనోహర్ నాయుడు అన్నారు. ఆదివారం పెండేకల్ ఆర్ఎస్‌లోని మారెళ్ల సొసైటీలో రైతులతో మాట్లాడారు. ఏటా రూ.లక్షల్లో తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని, సకాలంలో రెన్యువల్ చేసుకోవడం లేదా చెల్లించడం చేయాల న్నారు. అలా చేయకుంటే మొండిబకాయిల కింద వెళ్లి భవిష్యత్తులో రుణాలు అందవన్నారు.

## మండుటెండలోనే ప్రయాణికులు

- మౌలిక వసతులు కల్పించని ఆర్టీసీ అధికారులు


దేవనకొండ బస్టాండులో ఎండలో ప్రయాణికుల అవస్థలు

**దేవనకొండ, మే 11(ఆంధ్రజ్యోతి):** స్థానిక బస్టాండ్‌లో మండుటెండలోనే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండులో ఆర్టీసీ అధికారులు మౌళిక వసతులు కల్పించలేదు. వేసవి ఎండలకు అల్లాడిపోతున్నారు. నిర్వహణ లేకపోవడంతో మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి, వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

- పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు

**ఆలూరు, మే11(ఆంధ్రజ్యోతి):** క్రీడాకారులను ప్రోత్సహిస్తామని విశ్రాంత ఐఏఎస్ అధికారి, గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో బీజేఆర్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలు రాక్ స్టార్ టీంకు రూ.30,116లు, రన్నర్ రెడ్ వింగ్స్ టీంకు రూ.20,116లు, కప్‌ను అందించారు. కరస్పాండెంట్ రవి, నిర్వాహకులు త్యాగరాజు, పవన్, రాము, రామకృష్ణ, సుందర్, కెప్టెన్‌లు సునీల్, మహేష్ పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగం మరువలేనిది


నివాళి అర్పిస్తున్న నాయకులు, అధికారులు,పోలీసులు

**దేవనకొండ, మే 11 (ఆంధ్రజ్యోతి):** దేశ రక్షణ కోసం ఆశువులు బాసిన మురళీనాయక్, సచిన్‌యాదవ్ త్యాగం మరువలేనిదని నాయకులు, పోలీసులు అన్నారు. ఆదివారం దేవనకొండ పంచాయతీ ఆవరణలో మృతిచెందిన సైనికుల చిత్రపటాలకు నివాళి ఆర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. సైనికుల ప్రాణత్యాగాలతో దేశం గర్విస్తోందని కోనియాడారు. కార్యక్రమంలో ఉచ్చీరప్ప, బోడ రవి, ,రామాంజినేయులు, ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నేడు పుణ్య స్మరణోత్సవం

**ఆదోని అగ్రికల్చర్, మే 11 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని చౌకీమటంలో పరమ పూజ్య రాచోటి మహా శివయోగి 259వ పుణ్య స్మరణోత్సవం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి నిరంజన్ ప్రణవ స్వరూప మరి రాచోటి మహాస్వామి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉరవకొండ గవి మఠం పీఠాధిపతి, సింధనూరు, కల్లుమట్టం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్ర స్వామి, నిరంజన్ జగద్గురు సింహాసన నదీశ్వర స్వామి, గురుసిద్దాదేవర వంటి పీఠాధిపతి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొంటారని తెలిపారు.

## టి.ఎంసెట్‌లో పత్తికొండ విద్యార్థికి 18వ ర్యాంకు


కప్పట్రాళ్ల చెన్నకేశవ

**పత్తికొండ, మే 11(ఆంధ్రజ్యోతి):** తెలంగాణ ఎంసెట్‌లో పత్తికొండకు చెందిన కప్పట్రాళ్ల చెన్నకేశవ 18వ ర్యాంకు సాధించాడు. తల్లి కల్యాణి ఉపాధ్యాయురాలు కాగా, తండ్రి రమేశ్ వైద్యశాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. చెన్నకేశవను తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు.

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**వెల్దుర్తి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి):** ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయని చీఫ్ సూపరింటెండెంట్ అశోక్ బాబు, డిపార్టుమెంట్ ఆఫీసర్ రామాంజనేయులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఉంటాయని, మొత్తం 460 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

## వాహనాల తనిఖీ

**ఆదోని రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆదోని - శిరుగుప్ప రహదారి పెద్దహరివాణం చెక్‌పోస్టు వద్ద ఇస్పీ పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలను వేగంగా నడవద్దని, కర్ణాటక మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని, కాలం చెల్లిన వాహనాలను నడప వద్దని ఎస్ఐ నాయక్ వాహనదారులకు సూచించారు.

## రేపు వైద్యశిబిరం

**మద్దికెర, మే 11 (ఆంధ్రజ్యోతి):** స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో ఈ నెల 13న ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అనిత యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు కర్నూలు గౌరిగోపాల్ హాస్పిటల్ వారు గుండె, షుగర్, బీపీ, ఈసీజీ, కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు.

## తాగునీటి పైపులైన్ ధ్వంసం

- వ్యక్తిపై కేసు నమోదు

**ఆదోని రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కుప్పగల్లులో తాగునీటి పైపులైన్‌ను ధ్వంసం చేసినందుకు కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి మద్యం మత్తులో పైపులైన్‌ను శనివారం రాత్రి ధ్వంసం చేశాడని సర్పంచ్ నాగిరెడ్డి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## జవాన్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న స్పందన సొసైటీ సభ్యులు

**పత్తికొండ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి):** పాకిస్థాన్‌తో యుద్ధంలో అశువులు బాసిన వీర జవాన్ మురళీనాయక్‌కు యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఆదివారం పత్తికొండ యువ స్పందన స్టడీ సర్కిల్ కార్యాలయంలో కొవ్వొత్తులు వెలగించి జోహార్, అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలర్పించిన మురళీనాయక్ సేవలు మరువలేనివన్నారు. సెక్రటరీ నాగరాజు, రాజేశ్వరి, ఖాజా, జైవీర ఉన్నారు.

## పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న అంజిబాబు

**ఆదోని అగ్రికల్చర్, మే 11 (ఆంధ్రజ్యోతి):** కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు పిలుపునిచ్చారు. ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతం చేసేందుకు ఆదివారం విద్యుత్ కార్యాలయంలో కార్మికులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌కు అప్పజెప్పేందుకు కుటిల యత్నం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే రైల్వే, బ్యాంకింగ్ రంగాలను ప్రైవేటు పరం చేసి యువతకు ఉద్యోగాలు రాకుండా చేసిందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, బాబు, సోము, సీఐటీయూ నాయకులు ఈరన్న, తిప్పన్న పాల్గొన్నారు.

## దాతల పేర్లు పెట్టాల్సిందే

- కమిషనర్‌కు సూచించిన ఎమ్మెల్యే

**ఆలూరు, మే11(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు దాతల పేర్లు పెట్టాల్సిందేనని పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌కు సూచించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ప్రారంభానికి అడ్డంకులు' కథనంపై ఆయన స్పందించారు. గొప్ప మనస్సుతో దాతలు నాగిరెడ్డి, సంజీవ్ రెడ్డి 5 ఎకరాలను ఇస్తే వారి పేర్లు పెట్టకపోవడం సరి కాదని, ఈ విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు.

## గడ్డివాములు దగ్ధం

**ఆలూరు, మే11(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ముద్దనగేరి గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాటాక గడ్డివాములకు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మల్లయ్య, రామచంద్రారెడ్డి లక్ష్మీరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమకు చెందిన 7 గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

## పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు



**హాలహర్వి, మే11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసి, అభివృద్ధికి కృషి చేస్తానని మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు అన్నారు.

**ప్రశ్న:** మండలాభివృద్ధికి ఎలా పని చేస్తున్నారు?

**జవాబు:** మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారుల సమన్వయంతో పనిచేస్తున్నాం. గ్రామస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

**ప్రశ్న:** మండలంలో రహదారులు ఎలా ఉన్నాయి?

**జవాబు:** చాలా గ్రామాలకు రహదారులు లేవు. ఛత్రగుడి, చింతకుంట నుంచి సాకిబండ, నిట్రవట్టి నుంచి విరుపాపురం వరకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిధులు మంజూరవుతాయని జిల్లా అధికారులు చెప్పారు.

**ప్రశ్న:** మండలంలోని తాగునీటి పథకాలు ఎలా పనిచేస్తున్నాయి?

**జవాబు:** బాపురం, విరుపాపురం, చింతకుంట జలాశయాలు ఉన్నాయి. వాటి ద్వారా తాగునీటి సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**ప్రశ్న:** తమకు తాగునీరు అందడంలేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.?

**జవాబు:** కొన్ని గ్రామాలకు పైపులైన్ల సమస్యతో తాగునీరు అందడంలేదని మా దృష్టికి వచ్చింది. నూతన పైపులైన్ వేయడానికి ప్రతిపాదనలు పంపాం.

**ప్రశ్న:** సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయి?

**జవాబు:** సంక్షేమ పథకాల కోసం సర్వే చేస్తున్నాం. అందరికీ పథకాలు అందేలా సర్వే చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**ప్రశ్న:** మండలంలోని పాఠశాల స్థితి ఎలా ఉంది?

**జవాబు:** చాలా పాఠశాలలకు ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉంది. అధికారులతో చర్చించి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

## శిథిలావస్థలో సచివాలయం




శిథిలావస్థలో బసలదొడ్డి సచివాలయం

**పెద్దకడుబూరు, మే11 (ఆంధ్రజ్యోతి):** పెద్దకడుబూరు మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలోని సచివాలయం శిథిలావస్థకు చేరింది. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఈభవనాన్ని సచివాలయం కోసం వినియోగిస్తున్నారు. అయితే భవనం కాస్త శిథిలావస్థకు చేరి గోడలు పగుళ్లు వచ్చాయి. దీంతో అక్కడ పనిచేసే సిబ్బందితో పాటు సచివాలయానికి వచ్చే ప్రజలు కూడా ఎప్పుడు భవనం కూలుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయానికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## మతసామరస్యానికి ప్రతీకగా ఖాదర్‌లింగ స్వామి ఉరుసు



ప్రత్యేక ఫాతేహలు చేస్తున్నదర్గా ధర్మకర్త, పీఠాధిపతి

**కౌతాళం, మే 11(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రమైన కౌతాళంలో హిందూ, ముస్లిం అనే తేడాలేకుండా మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం స్వామి వారి ఉరుసు దర్గా ధర్మకర్త పెద్ద మున్నా పాషా చిస్తి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. స్వామి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచి భారీ సంఖ్యలో బారులు తీరారు. ఈ సందర్భంగా దర్గా ధర్మకర్త మాట్లాడుతూ స్వామివారి ఉరుసు ఐదు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌతాళం సీఐ అశోక్‌కుమార్ పటిష్ట బందోబస్తు చేపట్టారు. ఇప్పటికే దర్గాను ప్రత్యేక విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి




సమ్మె డిమాండ్ల కార్డులు చూపిస్తున్న ఆశావర్కర్లు, నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి):** ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలను రద్దుచేయాలని మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి బి శివలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక సీఐటీయు కార్యాలయంలో జరిగిన సమావేశంలో శివలక్ష్మి, మండల అధ్యక్షులు గోవిందు,కార్యదర్శి రాముడు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి ఆశా కార్యకర్తలు చాలీచాలని వేతనాలతో అనేక సేవలు చేస్తున్నారని అన్నారు. సుప్రీంకోర్టు కనీస వేతనం ఇవ్వాలని ఆదేశాలు జారీచేసిన కూటమి ప్రభుత్వం ఆశావర్కర్ వేతనాల పట్ల నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు మంజుల, సుమిత్ర, రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గడ్డివామి దగ్ధం



దగ్ధమైన గడ్డివామి

**కోసిగి, మే 11 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని దొడ్డి బెళగల్ గ్రామంలో రైతు ఈడిగ భీమయ్యకు చెందిన గడ్డివామి విద్యుత్ ఘాతంతో కాలిపోయి రూ.లక్ష నష్టం వాటిల్లిందని రైతు ఈడిగ భీమయ్య తెలిపారు. గాలి అధికంగా వీచడంతో పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి తగిలి నిప్పురవ్వలు గడ్డివాములపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డివామి మంటల్లో కాలిపోయి బూడిదవ్వడంతో భీమయ్య తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## కోసిగిలో పోలీసుల సోదాలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

**కోసిగి, మే 11 (ఆంధ్రజ్యోతి):** జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రమైన కోసిగిలోని రైల్వేస్టేషన్, బస్టాండు తదితర ప్రాంతాల్లో సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి పోలీసు సిబ్బందితో ముమ్మర తనిఖీలు చేపట్టారు. కోసిగి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులను తనిఖీలు చేసి అనుమానాస్పద వస్తువులను పరిశీలించారు. అనంతరం రైల్వేస్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అలాగే ఆర్టీసీ బస్టాండులో అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రయాణికుల బ్యాగులను చెకింగ్ చేశారు. కోసిగి సీఐ మంజునాథ్ మాట్లాడుతూ జిల్లా పోలీసుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద స్థితి గలవారు, కొత్తవారు కనిపిస్తే వారు వివరాలు తెలియజేయాలన్నారు. ఇండియా, పాకిస్థాన్ బార్డర్‌లో ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా భయపడవద్దని, దేశ సైనికులు దేశాన్ని రక్షించేందుకు పని చేస్తున్నారని అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

# చలివేంద్రాలు ఏవీ?

- తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు
- చలివేంద్రాలను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**గోనెగండ్ల, మే 11(ఆంధ్రజ్యోతి):** ఉష్ణోగ్రతలు ప్రతి సంవత్సరం పెరిగిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకు నమోదు అవుతుండడంతో ప్రజలకు దాహం విపరీతంగా పెరిగిపోతోంది. అయితే ఈ సమయంలో ఆయా గ్రామాలలో పంచాయతీ అధికారులు ఇతర రాజకీయ నాయకులు గ్రామాల కూడలిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గ్రామ పంచాయతీ అధికారు లపై మరింత బాధ్యత ఉంది. పాలకులు, అధికారులు, నాయకులు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం మర్చిపోయారు.. ఏదో కంటి తుడుపు చర్యగా ఏర్పాటు చేసి మమ.. అనిపిస్తున్నారు. ఫలితంగా మండలంలోని పలు గ్రామాల్లో చలివేంద్రాలు కనిపించడం లేదు. ఎండ తీవ్రత దృష్ట్యా మార్చి నుంచి జూన్ నెల ఆఖరి వరకు గ్రామ పెద్దలు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది వారు కూడా ముందుకు రాలేదు.




గోనెగండ్ల బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రం

### మండలంలో ఒకటి మాత్రమే

మండలంలో 20 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అయితే మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కేవలం ఒక్కటి మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రజల అవసరం అయిన చలివేంద్రాలు ఏర్పాటుకాలేదు. గ్రామ పంచాయతీలలో ప్రజలు నిత్యం కార్యాలయంకు వచ్చి వెళుతుంటారు. వారికోసమైనా చలివేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే మండల కేంద్రమయిన గోనెగండ్లకు కూడా ప్రతి నిత్యం పలు గ్రామాల నుంచి ప్రజలు పనుల కోసం కొన్ని గ్రామాలలో పంచాయతీ కార్యాలయాలు గ్రామ నడిబొడ్డున ఉండగా మరికొన్ని గ్రామాల్లో గ్రామ శివార్లలో ఉన్నాయి. ఇలాంటి సమయంలో కార్యాలయానికి వచ్చే ప్రజలు, వృద్ధులు, యువకులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. పనుల నిమిత్తం ఊళ్లకు వెళ్లేవారు. పొలాలకు వెళ్లేవారు ,తాగునీరు అందుబాటులో లేని కారణంగా సొమ్మసిల్లి పడపోయన సంఘటలు ఉన్నాయి. మండల కేంద్రాల కూడా చలివేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలు పంచాయతీలలో నిధులు ఉన్నప్పటికి వేసవిలో ప్రజల దాహర్తి తీర్చడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు.

### ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించాలి



గోనెగండ్ల మండలంలో పలు గ్రామాలకు బస్సు సౌక ర్యాలు లేవు. దీంతో ప్రయాణికులు ప్రదాన రహదారిని చేరుకొని అక్కడి నుంచి ఆటోలలో, ఇతర వాహనాలలో పట్టణాలకు వెలుతుంటారు. కావున ప్రధాన రహదారుల వద్ద అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అవసరం.

● మురళీనాయుడు, గోనెగండ్ల

### చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ కార్యాలయంల దగ్గర, ఆరోగ్య కేంద్రాల దగ్గర తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ వేసవిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జూన్ నెల వరకు ప్రజల దాహర్తి ని తీర్చాలి.

- రాముడు, గంజహళ్లి

## రాఘవరాయలకు విశేష పుష్పాలంకరణ

### మంచాలమ్మకు వెండికవచ సమర్పణ సేవ

**మంత్రాలయం, మే 11 (ఆంధ్రజ్యోతి):** వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య రాఘవరాయల బృందావనానికి విశేష పుష్పాలంకరణ చేశారు. అదే విధంగా మంచాలమ్మ దేవతకు వెండికవచ సమర్పణ సేవ చేశారు. ఆదివారం వైశాఖ త్రయోదశి శుభసందర్భాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి బృందావనానికి, మంచాలమ్మకు విశేష అభిషేకాలు చేసి బంగారు, వెండి ఆభరణాలతో పాటు బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో స్వామివారిని, అమ్మవారిని అలంకరించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పీఠాధిపతి అష్టోదకం చేసి మహా మంగళహారతులు ఇచ్చి భక్తులను ఆశీర్వదించారు.

## పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న మండల కార్యదర్శి రాముడు

**ఎమ్మిగనూరు టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే వర్కర్స్‌కు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనం రూ15 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వీవర్స్ కాలనీలోని స్కూల్ నందు వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న స్కూల్‌వర్కర్స్ కేవలం రూ6వేలు మాత్రమే ఇస్తున్నారు. ప్రస్తుతం ధరలకు కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. వేతనాలు పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, కవిత, గణేష్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలయంలో ముమ్మర తనిఖీలు



బస్టాండులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివాంజల్, పోలీసు సిబ్బంది

**మంత్రాలయం, మే 11 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు జల్లెడ పడుతున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ రామాంజులు, మంత్రాలయం మాధవరం ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్ తమ సిబ్బందితో ఆర్టీసీ బస్టాండు, రాఘవేంద్ర సర్కిల్, కర్ణాటక, ఆంధ్ర బస్సులు, తుంగభద్ర రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలతో పాటు లాడ్జీల్లో తనిఖీలు చేపట్టారు. ఎటువంటి అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లాడ్జీ యజమానులకు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండులు నిర్వహించే వారికి ఆదేశాలు జారీచేశారు. ఈ తనిఖీల్లో గురుమూర్తి, మల్లికార్జున స్వామి, లక్ష్మన్నగౌడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమఠానికి పోటెత్తిన భక్తులు

**మంత్రాలయం, మే 11 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. శని, ఆదివారాలు వరుసగా సెలవు దినాలు కావడంతో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో శ్రీమఠం ప్రాంగణం, అన్నపూర్ణ భోజనశాల, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు భక్తులతో కిక్కిరిసాయి. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీల ధరలకు రెక్కలొచ్చాయి. మంత్రాలయంలో ట్రాఫిక్ అస్థవ్యస్తంగా మారి ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు ఆటోల ఇష్టారాజ్యంతో ట్రాఫిక్ సమస్యతో భక్తులు నరకం చూశారు. భక్తుల రద్దీ పెరగడంతో శ్రీమఠం అధికారులు క్యూలైన్లు, పరిమళ ప్రసాదానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు.

## బసవన్న సాహిత్యంపై రాష్ట్రస్థాయి సదస్సు




మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్

**ఎమ్మిగనూరు, మే11(ఆంధ్రజ్యోతి):** విశ్వగురువు బసవన్న సాహిత్యంపై డివిజన్ కేంద్రమైన ఆదోనిలో త్వరలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణంలోని ఆదివారం ఓ ప్రైవేటు పాఠ శాలలో జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప ఆధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి హాజరైన కెంగర మోహన్ మాట్లాడు తూ ఈ భూమి శ్రమజీవులదని ఈ శ్రమలోనే సమాజం నిర్మిత మైందని సమాజంలో కులం, మతం లేదని మానవత్యమే ఈ సమా జానికి జీవనాధారమని చాటిచెప్పిన మహోన్నతుడు విశ్వగురువు బసవన్న అని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతి సభల నిర్వహణకు జాబితాను విడుదల చేసిందని, ఈ జాబితాలో గురుజాడ అప్పారావు, కందుకూరి వీరేశ లింగం, గుర్రం జాషువా పేర్లు ప్రకటించకపోవటం విచారకరమ న్నారు. వెంటనే వీరి పేర్లను చేర్చి సవరణ జాబితాను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జంద్యాల రఘుబాబు, జిల్లా ప్రధానకార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, నాయకులు ఎన్ నాగమణి, పార్వతయ్య, మహేష్ కుమార్, గొరంట్ల, ఆదోని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు డా భాస్కర్, స్వయం ప్రభలు పాల్గొన్నారు.

## చదువుల రామయ్య కాలనీలో సమస్యల తిష్ఠ



సీసీ రోడ్డు, డ్రైనేజీ లేని ఓ వీధి

**గోనెగండ్ల, మే 11(ఆంధ్రజ్యోతి):** చదువుల రామయ్య కాలనీ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ముప్పైఐదేళ్లుగా కాలనీ సమస్యలు పట్టించుకున్న నాయకులు, అధికారులే లేరని చదువుల రామయ్య కాలనీ వాసులు వాపోతున్నారు. కమ్యూనిస్టు నాయకుల తో కలసి పోరాటం చే స్తే ప్రభుత్వం 100 గృహాలకు పట్టాలు ఇ చ్చిందని ఆనాటి నుంచి నేటివరకు ప్రతి ఇంటి నుంచి పంచాయతీకి ఇండ్ల గుత్తలు కడుతున్నా.. ఏ నాయకుడు మా కోర్కెలు తీర్చలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో అయినా కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఇప్పటికైన అధికారులు నాయకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## నేడు కోసిగయ్య స్వామి మహా రథోత్సవం

**కోసిగి, మే 11 (ఆంధ్రజ్యోతి):** కోసిగి భక్తుల ఆరాధ్య దైవమైన కోసిగయ్య స్వామి మహారథోత్సవం సోమవారం అశేష భక్త జనవాహిని మధ్య సాయంత్రం సంధ్యావేళలో 5 గంటల నుంచి 6 గంటల వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సాయికుమార్ తెలిపారు. ఆదివారం కోసిగయ్య దేవాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఆలయ ధర్మకర్తలు శ్రీనివాసులు దొర, మురళి దొర, ఈవో సాయికుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు జయతీర్థ స్వామి, రఘునందనస్వామి వేద మంత్రోచ్చరణాల మధ్య కన్నుల పండువగా మేళతాళాలు, బాజా భజంత్రీల మధ్య నిర్వహించారు. ఈ కళ్యాణ వేడుకల్లో ఆలయ అర్చకులు విష్ణుజిత్తు, దుర్గా ప్రసాద్ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం 6 గంటల సమయంలో ఆంజనేయస్వామి ఉత్సాయి రథోత్సవం తేరుబజారు మైదానంలో వేద పండితులు జయతీర్థ స్వామి, ఆలయ ధర్మకర్త మురళిదొర ఆధ్వర్యంలో భక్తుల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈ రథోత్సవాలకు కొత్తగా పెళ్లయిన నూతన దంపతులు పెళ్లి వస్త్రాలను ధరించి ఈ రథోత్సవాల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకునే ఆనవాయితీ ఆనాటి నుంచి నేటి వరకు ఉంది. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామని, ఎవ రైనా అల్లర్లకు పాల్పడితే వారిపైన కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తా మని కఠినచర్యలు తీసుకుంటామని సీఐ మంజునాథ్, ఎస్ఐ హను మంతరెడ్డి తెలిపారు.

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు

కోసిగిలోని తేరుబజారు మైదానంలో సోమవారం జరగనున్న కోసిగయ్య స్వామి రథోత్సవ వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సీఐ మంజునాథ్, ఆలయ ఈవో సాయికుమార్‌కు సూచించారు. ఎస్ఐ హనుమంతరెడ్డితో కలిసి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరాములుతో కలిసి రథోత్సవ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. రథోత్సవానికి కోసిగి మండలంతో పాటు పక్క మండలాలు, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్నారనీ, రథోత్సవంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఈవో సాయికుమార్‌కు సీఐ తెలియజేశారు.

## వీర జవాన్‌కు ఘన నివాళి




మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

**కౌతాళం, మే 11(ఆంధ్రజ్యోతి):** పాకిస్థాన్ ముష్కరుల తుపాకీ తుటాలకు వీరమరణం పొందిన ఆంధ్రప్రదేశ్ జవాన్ మురళీ నాయక్‌కు మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం మండల కేంద్రమైన కౌతాళంలో వైఎస్ విగ్రహం వద్ద మురళీనాయక్ చిత్రపటానికి వైసీపీ నాయకులతో కలిసి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించి దేశ చరిత్రలో నిలిచి పోయారని ఆయన కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు అండగా ఉండి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ప్రహ్లాద ఆచారి, సర్పంచ్, ఉపసర్పంచ్ పాల్‌దినకరన్, సక్రితిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి నాయకులు ఉన్నారు

**పెద్దకడుబూరు:** దేశరక్షణ కోసం అమరుడైన జవాన్ మురళీనాయక్ సేవలు మరువ లేనివని కల్లుకుంట గ్రామస్తులు సత్యాగౌడ్, పక్కిరెడ్డి నరసింహగౌడు, శీనుగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రా మంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న కల్లుకుంట గ్రామస్థులు

## ఆటో, బైక్ ఢీ : ఒకరికి తీవ్రగాయాలు

**మంత్రాలయం, మే 11 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామంలో ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురుకి స్వల్ప గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం శనివారం రాత్రి జరిగింది. తుంగభద్ర నుంచి మంత్రాలయం వెళ్తున్న ఆటోను, మంత్రాలయం నుంచి మాధవరం వస్తున్న మోటారు సైకిల్ ఢీకొట్టడంతో మాధవరం గ్రామానికి చెందిన కమ్మరి ఉపేంద్రకు కాళ్ల విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకెళ్లగా. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్నారని ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు.

## రెండిళ్లలో చోరీ

**పెద్దకడుబూరు, మే11(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ముచ్చగిరి గ్రామంలో ఒకే రోజు రెండు ఇళ్లలో దొంగలు పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన కురువ మహదేవ ఇంట్లో ఒకటిన్నర గ్రాముల బంగారం, గుడిసె రంగమ్మ ఇంట్లో 24 తులాల వెండి, రూ.51వేల నగదును దొంగలించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## అన్నదానానికి రూ.1.50 లక్షల విరాళం

**మంత్రాలయం, మే 11 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి కాకినాడకు చెందిన రొబ్బి సూర్యప్రకాష్ అను భక్తుడు రూ.1.50 లక్షలు అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్లు తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకుని అన్నదానానికి రూ.1.50 లక్షలు నగదును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంత పురాణిక్, శ్రీపాదాచార్, నరసింహ దేశాయ్, సుజ్ఞానేంద్రలు పాల్గొన్నారు.

**నేడు పీఠాధిపతి 13వ పట్టాభిషేక మహోత్సవం:** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతిగా సుబుధేంద్రతీర్థులు 13వ పట్టాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా జరుపుకోనున్నారు. రాఘవేంద్రస్వామి మఠం పీఠాన్ని పొందిన శుభదినాన్ని పురస్కరించుకుని మఠం అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, లాడ్జీలు, దుకాణాల యజమానులు ఆయా బ్యాంకు, పోలీసు, రెవెన్యూ అధికారులు పీఠాధిపతిని ఘనంగా సత్కరించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు పీఠాధిపతి దివ్యసందేశాన్ని ఇచ్చి భక్తులను ఆశీర్వదించనున్నారు. ఇప్పటికే మఠం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## పేదలకు ఉచితంగా సేవ చేయాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్

**నందవరం, మే 11(ఆంధ్రజ్యోతి):** పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించాలని జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ పుష్పావతి అన్నారు. ఆదివారం నందవరం పంచాయతీ కార్యాలయంలో కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని అమె ప్రారంబించారు. డాక్టర్లు ఫయాజుద్దీన్, కౌశిక్, ఫాతిమా,అశ్వక్ వచ్చిన 120 మంది పేద ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, కొంత మందిని మెరుగైన చికిత్స కోసం కిమ్స్ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

## డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీ

**ఎమ్మిగనూరు, మే11(ఆంధ్రజ్యోతి):** మండలంలోని బనవా సి, మల్కాపురం, ఏనుగబాల గ్రామాల సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బనవాసి, మల్కాపురం గ్రామసచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేయటం, ఏనుగబాల గ్రామంలో డిజిటల్ అసిస్టెంట్ పోస్టు కొంతకాలంగా ఖాళీగా ఉంది. ఆ స్థానాల్లో కొత్త వారిని నియమించకపోవటంతో గ్రామస్థులు సంక్షేమపథకాలు నమోదు చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.